క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మందా రమణయ్య

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో జనసేన జిల్లా నాయకుడు మందా రమణయ్య శనివారం గుంటూరులో వైఎస్సార్‌సీపీలో చేరారు. రమణయ్యకు మంత్రి కాకాణి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి తాను వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా మందా రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం



బాలమ్మకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన మాదా బాలమ్మకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. వృద్ధురాలైన బాలమ్మ ఇల్లు నిర్మించుకొనేందుకు శనివారం ఆ గ్రామంలో ఈ ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, వెన్ను ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో ఉచిత శిక్షణకు వింటర్ క్యాంప్



పరుగు పందెం ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

ముత్తుకూరు: అదానీ వరల్డ్ స్కూల్‌లో సంక్రాంతి సెలవుల్లో క్రీడలకు సంబంధించి వింటర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రితేష్ మెహతా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు 6–16 ఏళ్ల లోపు పిల్లలకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. క్రీడారంగంలో నిపుణులైన ఉపాధ్యాయులచే బాస్కెట్ బాల్, ఖోఖో, ఫుట్‌బాల్, ఏరోబిక్స్, జుంబా, లైఫ్ స్కిల్స్ వంటి క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో పాల్గొనే పిల్లలకు రవాణా సౌకర్యంతో పాటు అల్పాహారం అందిస్తామని, ఉదయం 8.30 నుంచి 11.40 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు 93987 88633, 94921 44954 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

కొబ్బరి మొక్కల పంపిణీ



తోటపల్లిగూడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటంరెడ్డి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని మండలంలో పలు గ్రామాల ప్రజలకు దాదాపు 2 వేల కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో శనివారం పేడూరు పంచాయతీ కొలిదిబ్బ గిరిజన కాలనీవాసులకు కొబ్బరి మొక్కలను అందించారు. ఆయన వెంట పేడూరు సొసైటీ అధ్యక్షుడు తిక్కవరపు సతీష్‌కుమార్‌రెడ్డి, నాయకులు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఈదూరు రమేష్, సాదేపల్లి శ్యాం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

కోడిపందెం స్థావరంపై ఎస్‌ఈబీ దాడులు

- పోలీసుల అదుపులో 10 మంది
- రూ.8,300 నగదు, 5 కోళ్లు స్వాధీనం

మనుబోలు: మండలంలోని వడ్లపూడి చెరువు వద్ద కోడిపందెం స్థావరంపై ఎస్‌ఈబీ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. వడ్లపూడి సమీపంలో ముమ్మరంగా కోడిపందేలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడుల్లో కోడి పందేలు వేస్తున్న 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,300 నగదు, 11 బైక్‌లు, 5 కోళ్లు, 4 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై బాలకృష్ణ, సిబ్బంది, డీటీఎఫ్, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలతో సంతోషం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగపట్నంలో రెండో రోజు శనివారం ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా రూ.1.85 లక్షల కోట్లతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారంగా అవ్వాతాతలకు ప్రతి నెలా అందించే పింఛన్ నగదును రూ.2,500 నుంచి రూ.2,750లకు పెంచి జనవరి ఒకటో తేదీ నుంచి అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి గ్రామ స్థాయిలోనే ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా తాము గ్రామాల్లో పర్యటించినపుడు గుర్తించిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులను అందిస్తోందని తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. దీంతో ప్రతిపక్షానికి చెందిన వారు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కల్పన, వైస్ ఎంపీపీ కైలాసం లావణ్య, నాయకులు పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, కొండూరు కృష్ణారెడ్డి, మారుబోయిన సంతోష్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు సిద్ధవరపు రమ్య, తంబు గంగమ్మ, సర్పంచ్ నిరంజన్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

పొదలకూరు: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పొదలకూరు తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా డి.రామకృష్ణారెడ్డి, సహాధ్యక్షుడిగా ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఏవీ రమణమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.రాజయ్య, ట్రెజరర్‌గా ఐ.రమేష్‌బాబు, ఏడు మంది ఉపాధ్యక్షులుగా, మరో ఏడు మంది సంయుక్త కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎస్.నాగరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వై.మల్లికార్జున, తాలూకా యూనిట్ పరిధిలోని పొదలకూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు మండలాల ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంఈఓ దిలీప్

బుచ్చిరెడ్డిపాళెం: పాఠశాలల అభివృద్ధిలో అన్ని పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలని మండల విద్యాశాఖాధికారి దిలీప్ కోరారు. బుచ్చిరెడ్డిపాళెంలోని విద్యావనరుల కార్యాలయంలో శనివారం తల్లిదండ్రుల కమిటీ సభ్యులతో ఎంఈఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24వ సంవత్సరానికి సంబంధించి పాఠశాల అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. అందుకోసంగా ఈ నెల 8, 9వ తేదీల్లో ఆయా గ్రామాల్లో సభలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొని పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలను గుర్తించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలో మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ, పిల్లల నూతన ఆవిష్కరణలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పెనుబల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రత్నం, ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎంలు

మనుబోలు: క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంచడంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం డేవిడ్ అన్నారు. సేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో మనుబోలులో ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్న ఎస్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులు, యువత చెడువ్యసనాల వైపు దృష్టి పెట్టకుండా ఆట విడుపుగా క్రీడలు ఉపకరిస్తాయని తెలిపారు. సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనాథ్‌రెడ్డి సేవలను కొనియాడారు. టోర్నమెంటులో పాల్గొనదలచిన జట్లు ఈ నెల 10వ తేదీ లోపు రూ.800 ఎంట్రీ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వసంత కుమారి, ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరావు, షావలి, ప్రమీల, రాణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వలపై అసత్య ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలో యూరియా కొరత ఉందంటూ టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఈ విషయంలో వారు నిజం తెలుసుకుని మాట్లాడితే మంచిదని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవుపలికారు. విడవలూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడారు. టీడీపీ నాయకులు మండలంలో యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మండలంలోని 24 వేల ఎకరాల్లో వరిసాగు వేస్తుండగా, విడవలూరులో మాత్రం 3,400 ఎకరాలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు రైతుభరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా 165 టన్నులు, డీలర్లకు మరో 110 టన్నులు యూరియా వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై విమర్శించే స్థాయి టీడీపీ నేతలకు లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ప్రసాద్, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

తండ్రిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): తండ్రిపై హత్యాయత్నానికి పాల్పడిన తనయుడ్ని నవాబుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట శివాలయ సమీపంలో మల్లికార్జున, వసంతమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు అశోక్‌కుమార్‌కు వివాహమైంది. కరెంట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. మద్యానికి బానిసై సంపాదించిన మొత్తాన్ని దానికే తగలేసేవారు. ఈ విషయమై అశోక్, భార్య మధ్య విభేదాలొచ్చాయి. మద్యం మత్తులో ఆమెను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేయడంతో కొంతకాలం క్రితం పుట్టింటికెళ్లిపోయారు. అప్పటి నుంచి పనికెళ్లడాన్ని అశోక్ మానేశారు. భార్యను తీసుకురావాలని, తాగేందుకు డబ్బులివ్వాలని తండ్రిని వేధించడం ప్రారంభించారు. మద్యం తాగి కత్తితో తండ్రిని శుక్రవారం పొడవబోయారు. కుమారుడ్ని నెట్టేసి మల్లికార్జున బయటకు పరుగులు తీశారు. వసంతమ్మ పెద్దగా కేకలేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన అశోక్ పరారయ్యారు. పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆదేశాల మేరకు హత్యాయత్నం కేసు ను ఎస్సై తిరుపతయ్య నమోదు చేశారు. పుల్లమ్మసత్రం మార్కెట్‌యార్డ్ వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

విద్యార్థులకు వేమన పద్య పోటీలు

నెల్లూరు(బృందావనం): ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థులకు వేమన పద్య పోటీలను సింహపురి వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు కడపలో ఈ నెల 19న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారని చెప్పారు. విజేతలుగా నిలిచిన భవజ్ఞ, రేవతి, మానస, ప్రీతి, ప్రియాంక, జ్యోతి, నీలిమను సత్కరించారు. అసోసియేషన్ సభ్యులు రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపై నిర్లక్ష్యం తగదు

నెల్లూరు రూరల్: వృద్ధులపై కుటుంబసభ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. కొత్తూరులోని నెహ్రూ వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక వినియోగంతో అనర్థం

పొదలకూరు: వరి సాగులో యూరియా అధిక వినియోగంతో అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మండల వ్యవసాయాధికారి ఎ.వాసు సూచించారు. శనివారం పొదలకూరులో ఏఓ మాట్లాడుతూ రబీలో మండలంలో 14,000 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేసినట్లు తెలిపారు. యూరియాను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులోనే వాడాలని రైతులకు సూచించారు. మోతాదుకు మించి యూరియా వాడితే చీడపీడలతోపాటు పంట కోతదశలో వాలిపోతుందన్నారు. పంట కాలం పెరగడంతోపాటు, మిల్లింగ్‌లో విరుగుడు వస్తుందని తెలిపారు. పొలంలో నీటిని బయటకు పంపి యూరియా చల్లుకుంటే నత్రజని మొక్కకు బాగాపడుతుందని తెలిపారు.

స్కూటీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన సుబ్రహ్మణ్యంను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

కొడవలూరు: స్కూటీ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన కొడవలూరులో శనివారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు స్థానిక ఎస్సీకాలనీకి చెందిన సాదేపల్లి సుబ్రహ్మణ్యం కొడవలూరు సెంటర్‌లోని దుకాణానికి వచ్చి రోడ్డు దాటుతుండగా, అల్లూరు వైపు నుంచి వేగంగా వచ్చిన స్కూటీ ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం కాలు పూర్తిగా దెబ్బతినగా తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించి చికిత్సనిమిత్తం నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్సై జి.సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల బైండోవర్



నిందితులను డీటీ ఎదుట హాజరుపరుస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

కొడవలూరు: ఇద్దరు అక్రమ మద్యం నిందితులను కోవూరు ఎస్‌ఈబీ అధికారులు కొడవలూరు డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ ఎదుట శనివారం హాజరుపరిచారు. మండలంలోని నాయుడుపాళేనికి చెందిన దేవరకొండ పోలయ్య, రేగడిచెలికకు చెందిన కట్టా గంగాధర్ గతంలో కర్ణాటక మద్యం తెస్తుండగా ఎస్‌ఈబీ అధికారులు పట్టుకొన్నారు. వీరిద్దరినీ ఎస్‌ఈబీ సీఐ ఆర్.నరహరి, ఎస్సై టి.శ్రీనివాస్ శనివారం డీటీ ఎదుట రూ.2 లక్షల పూచీకత్తు, ఏడాదిపాటు బైండోవర్ అమలులో ఉండేలా హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో నాటుసారా స్థావరాలు, విక్రయాలు, పొరుగు రాష్ట్రాల మద్యం తరలింపులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పల్లెల్లో ప్రజలు సంక్రాంతి పండగను ప్రశాంతంగా జరుపుకోవాలంటే వీటిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే అన్నిచోట్ల తనిఖీలు నిర్వహించడంతో పాటు పాత నిందితులను బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా నాటుసారా స్థావరాలు, విక్రయాలు, పొరుగు రాష్ట్రా మద్యం విక్రయాలు జరుగుతుంటే వెంటనే 14500 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. వారి వెంట ఎస్‌ఈబీ కానిస్టేబుల్స్ పాల్, మస్తానయ్య, తులసి ఉన్నారు.

క్యాలెండర్, కరపత్రాల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చలపతిరావు తదితరులు

కొడవలూరు: మండలంలో ఆదివారం నుంచి వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచార కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా శ్యాంప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం ప్రత్యేక బృందం మండలంలో ప్రతి ఓటరును కలిసి తమ అభ్యర్థిని గెలిపించాలని కోరనున్నట్లు తెలిపారు. మండలంలోని నాయకులు ఇప్పటికే బృందాలుగా ఏర్పడి పెద్ద ఎత్తున పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించినట్లు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ధనుర్మాస పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజాము నుంచి ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామికి, శ్రీలక్ష్మీ గోదాదేవి అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రైతు బిడ్డలకు ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న కిరణ్‌రెడ్డి

మనుబోలు: మండలంలో రైతు కుటుంబాల నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగాల కోసం సాఫ్ట్‌వేర్ టెక్నికల్ సపోర్ట్‌లో భాగంగా వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌ఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నారపరెడ్డి కిరణ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని అక్కంపేటలో ఉన్న తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ నుంచి టెక్నికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో మొదటి విడత తరగతులు నిర్వహిస్తామన్నారు. సాఫ్ట్‌వేర్ స్కిల్స్‌లో భాగంగా డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, వెబ్ డిజైనింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్‌లలో ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్‌లో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. వీటితోపాటు ఇంటర్వ్యూ గైడెన్స్‌లో మెళకువలు నేర్పుతామని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మార్కెటింగ్ వింగ్స్ అనే ఐటీ సంస్థ భాగస్వామ్యంతో ఆయా కోర్సుల్లో నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. రైతు బిడ్డలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 7 తేదీ నుంచి 8712655114 మొబైల్ నంబర్‌కు రెజ్యూమ్ పంపాలని తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు జీవీకే చిన్మయ విద్యాలయంలో పదో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఐటీ, తిరుపతి ప్రొఫెసర్ ఎస్.రఘురామరాజు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయలను ప్రతిబింబిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. విద్యాలయ కరస్పాండెంట్ హరిత మాట్లాడుతూ అర్హత, అంకితభావం కలిగిన ఉపాధ్యాయ బృందంతో బోధన చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ అజిత్ ఠాగూర్ మాట్లాడుతూ అన్ని విభాగాల్లో విద్యార్థులకు విభిన్న అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెరగాలి

- డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి



సోషల్ ఆడిట్ గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీడీ

పొదలకూరు: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య బాగా పెరగాలని డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి సూచించారు. మండలంలోని మొగళ్లూరులో శనివారం జరిగిన సోషల్ ఆడిట్ గ్రామ సభలో ఏపీడీ మాట్లాడుతూ గత నెల 29వ తేదీ నుంచి మండలంలో రెండేళ్ల ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి జరిగిన ప్రతి పనిపై ఎం–బుక్ ప్రకారం క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్ బృందాలు విచారణ నిర్వహిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయా పనులకు హాజరైన కూలీల వివరాలను సైతం ఇంటింటికి వెళ్లి విచారిస్తారని, చివరగా గ్రామసభ ద్వారా పనులకు సంబంధించి బహిరంగ ప్రకటన చేస్తారన్నారు. పనులకు హాజరయ్యే కూలీలు ప్రతినిత్యం ఐదు గంటల పాటు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఉదయం 3 గంటలు, సాయంత్రం 2 గంటలు లేదా ఏకబిగిన ఒకే పర్యాయం 5 గంటలైనా పనిచేయొచ్చునని సూచించారు. కూలీల వివరాలపై ఎఫ్‌ఏలు మేట్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి పనిని ఎన్‌ఎంఎంఎస్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. నిమ్మ మొక్కల సాగు కోసం ఏప్రిల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. అన్ని గ్రామాల్లో సోషల్ ఆడిట్ పూర్తయిన తర్వాత చివరగా మండల స్థాయిలో ఒక రోజు సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మొగళ్లూరు సర్పంచ్ ఆకుల లక్ష్మి, టీఏ వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డీ.. ఇక విశ్రాంతి తీసుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- వైఎస్సార్‌సీపీ నేతల హితవు

ముత్తుకూరు: ఐదు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాజకీయాల నుంచి విశ్రాంతి తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, బీసీ నాయకుడు నడవడి ముత్యంగౌడ్, కె.లక్ష్మణరెడ్డి తదితరులు శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మత్స్యకారేతర ప్యాకేజీ విషయమై తహసీల్దార్‌తో చర్చించేందుకు వచ్చిన టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని ఆరోపించారు. సోమిరెడ్డి మాత్రం అడ్డదారిలో మంత్రి పదవి పొంది 2019 ఎన్నికలకు ముందు ఒక చీకటి జీఓ సృష్టించి పేదలను మోసం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే హోదాలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలోని తెలుపు రేషన్‌కార్డుదారులకు ప్యాకేజీ ఇస్తామని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారని తెలిపారు. మంత్రి కాకాణిని విమర్శిస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్‌నవీద్‌బాషా, యల్లంగారి రమణయ్య పాల్గొన్నారు.